## కాశ్ పటేల్

అమెరికాకు చెందిన అత్యున్నత దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నూతన డైరెక్టర్‌గా మొదటిసారి భారతీయ-అమెరికన్ కశ్యప్ (కాశ్) పటేల్ నియమితులయ్యారు. ఆయన నియామకానికి అమెరికన్ సెనెట్ ఫిబ్రవరి 20న ఆమోదం తెలిపింది. పటేల్ నియామకానికి అనుకూలంగా 51, వ్యతిరేకంగా 49 ఓట్లు వచ్చాయి. దీంతో పటేల్ ఎఫ్‌బీఐ 9వ డైరెక్టర్‌గా ఫిబ్రవరి 21న భగవద్గీతపై ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. కాశ్ కుటుంబ మూలాలు గుజరాత్‌లో ఉన్నాయి. న్యూయార్క్‌లోని గార్డెన్ సిటీలో 1980లో కాశ్ జన్మించారు.

## మొదటి ప్రయత్నంలోనే విజయం



25వ ర్యాంక్

**వ్యవసాయ కుటుంబంలో పుట్టినా ఉన్నతంగా ఎదగాలని నిర్ణయించుకున్నాడు. అందుకు నిరంతరం శ్రమించి ఎస్సైగా ఉద్యోగం సాధించాడు. అంతకంటే ఉన్నతమైన ఉద్యోగం చేయాలని గ్రూప్స్‌కు ప్రిపేరయ్యాడు. అలా కష్టపడి తాజాగా గ్రూప్-2లో 25వ ర్యాంక్ సాధించిన కూటికంటి శివ విజయ ప్రస్థానం.**

### నేపథ్యం

- మాది జనగామ జిల్లా పాలకుర్తి, తిరుమలాయపాలెం గ్రామం. నాన్న వెంకన్న. అమ్మ లక్ష్మి. వ్యవసాయం చేస్తున్నారు. నాకు అన్న ఉన్నాడు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సొంత గ్రామంలో, ఆరు నుంచి 10 వరకు మండల కేంద్రంలో చదివాను. వరంగల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాను.

### తల్లిదండ్రుల కష్టం చూసి

- నేను చిన్నప్పుడు తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయపడేవాడిని. వారి కష్టం చూశాను. జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాను. 2019లో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికయ్యాను. 2020లో ఎస్సైగా ఉద్యోగంలో చేరాను. అయినా గ్రూప్స్ సాధించాలనే లక్ష్యం మరువలేదు. కష్టపడి చదువుతూ గ్రూప్-2లో రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంకు సాధించాను.

### ప్రిపరేషన్

- తెలుగు అకాడమీ పుస్తకాలు చదివాను. రోజూ ఆరు నుంచి ఎనిమిది గంటలు సాధన చేశాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా లక్ష్యాన్ని వీడలేదు. నా అంతిమ లక్ష్యం సివిల్ సర్వీస్ సాధించడమే. జాబ్ చేస్తూనే సివిల్స్ సాధించేందుకు కృషి చేస్తాను.

### సలహా

- ముందుగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. దానికి తగ్గ పుస్తకాలు సేకరించుకోవాలి. గతంలో గ్రూప్స్ సాధించినవారి సలహాలు, సూచనలు తీసుకోవాలి. నిరంతరం సాధన చేస్తూనే ఉండాలి. ఎన్ని సమస్యలు వచ్చినా లక్ష్యాన్ని మరువొద్దు. సాధించేవరకు శ్రమించాలి.

**కన్నెబోయిన రాజు, మహబూబాబాద్**

## తండ్రి కష్టం చూసి.. మూడు ఉద్యోగాలు సాధించి



76వ ర్యాంక్

**పారిశుద్ధ్య కార్మికుని కొడుకు గ్రూప్-2 విజేతగా నిలిచాడు. 2018లో ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించాడు. తాజా గ్రూప్-2లో రాష్ట్ర స్థాయి 76వ ర్యాంకు, కాళేశ్వరం జోన్-1 టాపర్‌గా నిలిచాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాశీంపల్లికి చెందిన శనిగరపు ప్రవీణ్ కుమార్. సక్సెస్ స్టోరీ ఆయన మాటల్లో..**

### నేపథ్యం

- అమ్మ శనిగరపు రాధ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తుంది. నాన్న భద్రయ్య సింగరేణి కాలరీస్ కంపెనీలో పారిశుద్ధ్య పనులు (స్వీపర్) చేస్తుంటాడు. మేం ముగ్గురం సంతానం. అన్నయ్య నవీన్ ఇదే జిల్లాలోని మైలారం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. చెల్లెలు వరుణిక పెళ్లి అయ్యింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాను. అనంతరం స్టేషన్ ఘణపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 10వ తరగతి వరకు, జాకారంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాను. తర్వాత హైదరాబాద్‌లో నల్ల మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్) చేశాను. నాన్న స్వీపర్‌గా పని చేస్తూ వచ్చిన జీతం నాకే పంపేవాడు.

### గ్రూప్స్ సాధించడమే లక్ష్యం

- నాన్న నాకోసం పడే కష్టం చూసి గ్రూప్స్‌లో సత్తా చాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. బీటెక్ అనంతరం 2016లో గ్రూప్-2 నోటిఫికేషన్ వచ్చింది. అప్పుడు సరిగా ప్రిపేర్ కాకపోవడంతో ర్యాంకు సాధించలేకపోయాను. 2018లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, గ్రూప్-4 నోటిఫికేషన్స్ వచ్చాయి. మూడు రాశాను. ముందుగా పంచాయతీ కార్యదర్శి ఫలితాలు రాగా 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగంలో చేరాను. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఘణపురం మండలం కర్కపల్లిలో విధుల్లో చేరాను. మూడు నెలల్లోనే వీఆర్వో ఫలితాల్లోనూ పాసయ్యాను. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం మానేసి వీఆర్‌వోగా మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లిలో జాయినయ్యాను. కొవిడ్ కారణంగా గ్రూప్-4 ఫలితాలు 2021లో రాగా అందులోనూ ర్యాంకు సాధించాను. హైదరాబాద్‌లో కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాను. ఈ ఏడాది జనవరిలో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ వచ్చింది. ఇంకా ఉన్నత స్థానానికి వెళ్లాలనే తపనతో 2024లో గ్రూప్-2 రాశాను. ఉద్యోగానికి వెళ్లే ముందు, వచ్చాక సమయాన్నంతా ప్రిపరేషన్‌కే కేటాయించాను. పరీక్షకు ముందు ఒక నెల ఉద్యోగానికి లీవ్ పెట్టి రోజూ 17 నుంచి 18 గంటలు చదివాను. రాష్ట్రస్థాయిలో 76వ ర్యాంకు సాధించాను. కష్టానికి ఫలితం దక్కింది. ఇదే పట్టుదలతో గ్రూప్-1 కూడా సాధిస్తాను.

### అన్నయ్యలే ఆదర్శం

- పెద్దమ్మ కొడుకులు ఆకునూరి నరేశ్, ఆకునూరి సురేశ్ ఆదర్శం. మాలాగే వారిది కూడా చాలా నిరుపేద కుటుంబం. నరేశ్ కష్టపడి చదివి ఐఏఎస్ సాధించాడు. సురేశ్ అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (ఏసీటీవో)గా పనిచేస్తున్నాడు. మొదటి నుంచి వాళ్లు చాలా సపోర్టుగా నిలిచి సూచనలు, సలహాలు ఇచ్చేవారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివి గ్రూప్-2 సాధించాను.

### నిరుత్సాహం దరిచేరొద్దు

- గ్రూప్స్ మాత్రమే కాదు ఎలాంటి పోటీ పరీక్షలైనా ర్యాంక్ రాకపోతే ఏ మాత్రం నిరుత్సాహపడొద్దు. లక్ష్యంపైనే గురి పెట్టాలి. ధైర్యంతో ముందుకు సాగాలి. ఈసారి తప్పక సాధిస్తామనే పట్టుదలతో చదవాలి. ఎన్నిసార్లు ఓటమి చెందినా చదవడం ఆపవద్దు. గెలిచేవరకు కష్టపడాలి. అదే మన లక్ష్యాన్ని చేరుస్తుంది. ఐఏఎస్ సాధించిన మా అన్నయ్య నాకు పదే పదే ఈ విషయమే చెప్పేవారు.

**అమ్ముల తిరుపతి, జయశంకర్ భూపాలపల్లి**

## గ్రూప్-1 సాధించడమే లక్ష్యం



31వ ర్యాంక్

**గ్రూప్-1లో విజేతగా నిలవడమే తన లక్ష్యమని గ్రూప్-2 విజేత వేణు తెలిపాడు. 31వ ర్యాంక్ సాధించిన వేణు విజయం ఆయన మాటల్లో..**

### నేపథ్యం

- మాది నారాయణపేట జిల్లాలోని ఊట్కూర్ మండలం పగిడిమర్రి గ్రామం. తల్లిదండ్రులు పదమ్మ, బుగ్గప్ప. తండ్రి మక్తల్ మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడో తరగతి వరకు సొంత ఊరిలో, 8 నుంచి 10వ తరగతి వరకు నారాయణపేట పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో, ఇంటర్ సాయి కో ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో చదివాను. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను.
- గ్రూప్-2 ఆఫీసర్‌గా పని చేస్తున్న సోదరుడు, వార్డు ఆఫీసర్‌గా పని చేస్తున్న తండ్రి స్ఫూర్తితో గ్రూప్స్ సాధించమే లక్ష్యంగా పెట్టుకున్నాను. గ్రూప్-4లో ర్యాంక్ రావడంతో 2024 డిసెంబర్‌లో నారాయణపేట మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా జాయినయ్యాను.

### ప్రిపరేషన్

- 6 నెలలు హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నాను. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-2లో విజయం సాధించాను. తెలుగు అకాడమీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పుస్తకాలు చదివాను. రోజూ 6 నుంచి 7 గంటలు చదివాను. గ్రూప్-1 సాధించడమే లక్ష్యం.

### సిలబస్ చూసుకోవాలి

- గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యేవారు ముందుగా సిలబస్ మొత్తం చూసుకొని ప్రణాళికాబద్ధంగా చదువు కొనసాగించాలి. పరీక్షలు వాయిదా పడినా, ఇతర కారణలతో ఒత్తిడికి లోనుకావద్దు. తెలుగు అకాడమీ, ఇతర స్టాండర్డ్ పుస్తకాలు చదవడంతో పాటు సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి. చదివిన సబ్జెక్ట్‌ను ఎక్కువ సార్లు సాధన చేయాలి. ముఖ్యంగా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం చాలా అవసరం.

**శ్రీనివాసులు, నారాయణపేట టౌన్**

## కోచింగ్ లేకుండానే నాలుగు ఉద్యోగాలు



51వ ర్యాంక్

**కష్టపడటంతో పాటు లక్ష్యాన్ని ఇష్టపడితే విజయం సాధించవచ్చు. అలా ఇష్టంతో చదివి నాలుగు ఉద్యోగాలు సాధించాడు. అందులో ఒక ఉద్యోగం చేస్తూనే చదివి గ్రూప్-2లో 401 మార్కులతో జనరల్ కేటగిరీలో 51వ ర్యాంక్, బీసీ-ఎ లో 1వ ర్యాంక్ సాధించాడు అశోక్. విజయం సాధించిన తీరు ఆయన మాటల్లో..**

### నేపథ్యం

- మాది వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామం. అన్న అనిల్ ఓ దిన పత్రికలో పని చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నా తల్లిదండ్రులు రజక వృత్తి చేస్తూనే వ్యవసాయం చేస్తున్నారు.
- 1 నుంచి 4 వరకు అమ్మమ్మ ఊరు ధర్మారంలో, 5 నుంచి 10 వరకు లింగాపురం ప్రభుత్వ పాఠశాలలో చదివాను. 10వ తరగతిలో జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించాను. దీంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు పొంది ఇంటర్, బీటెక్ పూర్తి చేశాను.

### నాలుగు ఉద్యోగాలు సాధించాను

- బీటెక్ పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ఇంటివద్దే ప్రిపేరయ్యాను. అలా ప్రిపేరై ఏఆర్ ఎస్సై, గ్రూప్-4, వీఆర్‌వో, రైల్వే జాబ్స్ సాధించాను. ఏఆర్ ఎస్సైగా నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్నాను. విధులు నిర్వహిస్తూనే రోజూ 4 నుంచి 6 గంటలు గ్రూప్-2కు ప్రిపేరయ్యాను. పరీక్షకు ముందు 2 నెలలు సెలవు పెట్టి చదివాను. ప్రతి విషయాన్ని నాన్నతో చర్చించేవాడిని. అలా చర్చించడంతో చాలా విషయాలపై పట్టు సాధించాను. గ్రూప్-1 సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

### భవిష్యత్ తరాలకు సూచన

- ఏదైనా లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడు దానిపై ఇష్టంతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చు. రోజుకు కనీసం 8 గంటలు చదవాలి.

**కాసుల రామ్మోహనచారి, చెన్నారావుపేట**